

రేపు ధాన్యం సేకరణపై రీజనల్ కాన్ఫరెన్స్

హాజరు కానున్న మంత్రులు నాదెండ్ల, అచ్చెన్న

శ్రీకాకుళం ప్రతినిధి: ఖరీఫ్‌లో ధాన్యం సేకరణపై సోమవారం రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం పది గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరు కానున్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియపై అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు. సమావేశానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి జెసిలు పాల్గొనున్నారు. వీరితోపాటు ఆరు జిల్లాల పౌర సరఫరాల సంస్థల జిల్లా మేనేజర్లు, వ్యవసాయశాఖ జెడిలు, డిఎస్‌ఒలు, సహకారశాఖ, తూనికలు, కొలతలకు చెందిన అధికారులు హాజరుకానున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు జెడ్‌పిలో రైస్ మిల్లర్లు, రైతు సంఘాల నాయకులతో సమావేశం కానున్నారు.

గురువులపై యాప్‌ల భారం

ప్రజాశక్తి- టెక్కలి

ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ఆగ్రహన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఉపాధ్యాయులు, ఉద్యోగులపై అనుసరిస్తున్న వైఖరిపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికపరమైన లావాదేవీలపై ప్రభుత్వం స్పందించకుండా మిగతా విషయాలపై అనుసరిస్తున్న మెతక వైఖరిపై వారు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థికపరమైన లావాదేవీలపై ప్రభుత్వం స్పందించాలని సంఘాలు, రాష్ట్ర నాయకులు కోరుతున్నారు. అయినా రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాల్లో ఉద్యోగుల సంక్షేమంపై కినుక వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్న సమయాల్లోనే ఒక పిఆర్‌సిని కోల్పోయామని, ఇప్పుడూ కూటమి ప్రభుత్వంలో మరో పిఆర్‌సిని కోల్పోకుండా ఉండాలని భావిస్తున్నారు. దీంతో తమ హక్కులను కాపాడుకోవాలని ఉద్యోగులు అంటున్నారు.

ప్రభుత్వ తీరుపై ఫ్యాప్టో పోరుబాట



ఉద్యోగులకు బకాయి పడిన నాలుగు డిఎల్లో కనీసం రెండు డిఎలు అయినా మంజూరు చేయాలని కోరుతున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సంక్షేమమే పరమావధి అని చెబుతున్న ప్రభుత్వంలో ఉద్యోగులూ ప్రజలేనన్న విషయాన్ని ప్రభుత్వం మర్చిపోతుండడంపై ఉద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు, ఉద్యోగుల సంక్షేమం వైపు ఎందుకు ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి వివరిస్తూ... తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యాన రాష్ట్రస్థాయిలో సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయేతర పనుల్లో తమల్ని వినియోగించరాదని కోరారు. ప్రభుత్వం విద్యారంగంలో ప్రవేశపెట్టిన యాప్‌లు వల్ల ఉపాధ్యాయులకు భారంగా మారుతుంది. వాటిని వ్యతిరేకిన్నా... యాప్‌లను బహిష్కరిస్తామని హెచ్చరిక చేసి శుక్రవారం నుంచి ఆందోళన చేపట్టారు. అలాగే ఉపాధ్యాయ సంఘాలు సోమవారం నుంచి ఆందోళనను ఉధృతం చేయనున్నారు. విద్యారంగంలో ప్రస్తుతం వినియోగిస్తున్న 13 యాప్‌ల్లోని ఉపాధ్యాయుల హాజరు యాప్ మాత్రమే వినియోగించుకుని మిగిలిన యాప్‌లను బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో నాయకులు స్పష్టం చేశారు. దీంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, కర్మయోగి వంటి ముఖ్యమైన యాప్‌లను బహిష్కరించనున్నారు. సోమవారం నుంచి ఎఫ్ఎ-2 పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన యాప్‌లనూ బహిష్కరించనున్నారు. ఏదేమైనా ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై వారు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మందస

జీడీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని, సత్యసాయి క్యాష్యూ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఉపాధ్యక్షులు కె.కేశవరావు, జీడి సంఘం నాయకులు జి.బాలమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని సారంగిపురం, ఆర్.కె.పురం పరిధిలో ఉన్న జీడి, రైస్ మిల్లు కార్మికులతో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి యాజమాన్యం గత పది నెలల నుంచి పని ఇవ్వకుండా కార్మికులకు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. పని ఇవ్వలేని యెడల గ్రాడ్యూటీ, ఇతర అలవెన్స్‌లు



ర్యాలీ నిర్వహిస్తున్న జీడి కార్మికులు

చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు పని ఇవ్వకుండా అనధికారికంగా షెడ్డుల్లోకి పిక్కలు తరలించి పని చేసుకొని కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఒప్పందం ప్రకారం బోనస్ చెల్లిచకుండా వ్యత్యాసం చూపుతున్నారని అన్నారు. అన్ని చట్టాలను ఉల్లంగిస్తున్న యజమానులపై జిల్లా అధికార యంత్రాంగం ఏ చర్యలూ తీసుకోకపోవడం వల్లే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. పరిశ్రమల్లో మౌలిక సౌకర్యాలు లేకుండా కనీసం భద్రతా చర్యలు కూడా అమలు చేయకుండా కార్మికులను హెరాష్ చేస్తున్నారని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం పరిశ్రమలలో పూర్తి స్థాయిలో పని కల్పించాలన్నారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సత్యసాయి క్యాష్యూ యాజమాన్యం కార్మికులకు ఈ నెల 20 లోగా పరిష్కారం చూపాలని, లేకుంటే 21న యజమాని ఇంటి వద్ద నిరవధిక నిరసన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మిల్లు డ్రైవర్ల వేతన సవరణ వెంటనే చేయాలని కోరారు. కార్యక్రమంలో జీడి రైస్ మిల్లు కార్మికులు నాయకులు కె.శాంతమ్మ, బి.భారతి, కుమారి, ధనలక్ష్మి, డి.లక్ష్మి, కె.కృష్ణారావు, బి.మల్లేసు, ఆర్.ఏకాశి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పుస్తక మహోత్సవం



మాట్లాడుతున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- అరసవల్లి

నగరంలో వచ్చే నెల 11 నుంచి 20 వరకు పదిరోజుల పాటు తొలిసారిగా పెద్ద ఎత్తున అంగరంగ వైభవంగా వందకుపైగా పుస్తక ప్రచురణ సంస్థల ఆధ్వర్యాన సిక్కోలు పుస్తక మహోత్సవం-2025 పేరుతో వేలాది పుస్తకాల ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ కనుగుల సుధీర్, కో-చైర్మన్లు అట్టాడ అప్పలనాయుడు, నల్లి ధర్మారావు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ ఎల్.రామలింగేశ్వరరావు, కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు అన్నారు. నగరంలోని ఇల్లీసుపురం ఉన్న యుటిఎఫ్ భవనంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహోత్సవం నవంబరు 11 నుంచి 20 వరకు పది రోజుల పాటు నగరం నడిబొడ్డున ఏడు రోడ్డు కూడలి వద్ద గల మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పుస్తక స్టాల్స్ మధ్యన ఏర్పాటు చేసిన వేదికపై పది రోజుల పాటు ప్రతినిత్యం సాయంత్రం సాహిత్య సభలు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణ, పరిచయ సభలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా రాత్రి అదే వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా జానపద కళలైన తప్పెటగుళ్ళు, కోలాటం, జముకులపాట, ఎరుకల పాట, థింసా నృత్యం ఏకపాత్రాభినయాలు నాటికలు, నృత్యలు గాన సంగీత వాయిద్య, విన్యాసాలు ప్రజలను అలరింప చేయనున్నట్లు తెలిపారు. సైన్స్ ఫెయిర్ కూడా ఈ మహోత్సవంలో భాగంగా ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన వివిధ కళాశాలలు, స్కూళ్ల విద్యార్థులతో సైన్స్ ప్రయోగాలు ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. వైజ్ఞానిక ప్రముఖులతో ఇంద్రజాలం, మూఢవ విశ్వాసాల నిర్మూలన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించే వివిధ అంశాల పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలను బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులతోపాటు ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాలు అన్నిటిలోనూ జిల్లా ప్రజానీకం పాల్గొని వికాసం వినోదం విజ్ఞానం పొందాలని విజ్ఞప్తి చేశారు. సందర్శకులు సేద తీరేందుకు అల్పాహారం, తాగునీరు, టీ, కాఫీ విక్రయాలను లోపల అనుమతించనున్నట్లు వారు తెలిపారు ఇప్పటికే కలెక్టర్‌కు విషయం తెలిపి ఆయన అనుమతి తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, కళాకారుల పేర్లతో స్వాగత ద్వారాలు వేదికలు ఏర్పరిచి వారి నందరిని స్మరించుకొని స్ఫూర్తి పొందేలా చేయనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవం విజయవంతం చేయడానికి సాహిత్య, విద్య, సాంస్కృతిక విజ్ఞాన మీడియా మైదానం నిర్వహణ భద్రత ఆహార కమిటీలను ఏర్పరిచి ఇప్పటికే కృషి ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో గొంటి గిరిధర్, కంచరాన భుజంగరావు, పి.సుధాకరరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, బి.బలరాం, పొన్నాడ వరహానరసింహులు, చింతాడ తిరుమలరావు, దాసరి రామచంద్రరావు, పసిడిమొగ్గ మోహనరావు, కె.నాగమణి, పి.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

జూలై నాటికి మూలపేట పోర్టు పూర్తి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు



పరిశీలిస్తున్న అధికారులు

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు నిర్మాణ పనులను వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రవాణా, రహదారులు, భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. మండలంలోని మూలపేట పోర్టు నిర్మాణ పనులను ఎపి మారిటైమ్ బోర్డు సిఇఒ అభిషేక్ కుమార్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నార్త్, సౌత్ బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్, బెర్తులు, రహదారులు, పరిపాలన భవనాలు, రైలు మార్గం, గిడ్డంగుల నిర్మాణాలు తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోర్టు కాన్ఫరెన్స్ హాల్లో అభిషేక్ కుమార్‌తో కలిసి విశ్వసముద్ర కంపెనీ ప్రతినిధులతో మ్యాప్, దృశ్యశ్రావణ ప్రదర్శన ద్వారా ఇప్పటి వరకు చేపట్టి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా విశ్వసముద్ర ప్రతినిధులు మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్ని విభాగాల్లో 60 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న 300 ఎకరాల ఉప్పు భూములు అందకపోవడంతో కొన్నిచోట్ల పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీనిపై స్పందించిన కృష్ణబాబు, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2026 జూలై నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేలా సంబంధిత సంస్థలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ఎండీ సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పిపిపి విధానాన్ని వ్యతిరేకించాలి

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని ఉర్జాంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. దీనిని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో సైతం ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వర్తించే విధంగా అప్పటి సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. గ్రామస్థాయిలో వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. డాక్టర్ కావాలనే ఆలోచన కలిగిన పేద, సామాన్య వర్గాల చెందిన పిల్లలకు వారి లక్ష్యం నెరవేరే విధంగా కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారని చెప్పారు. అటువంటి మెడికల్ కళాశాలలు ప్రైవేటు వ్యక్తులకు ధారా దత్తం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడికి అందించాల్సిన వైద్యం, పేద విద్యార్థులకు డాక్టర్ కావాలని ఆలోచనలను నాశనం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం కుట్రపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిసి ముద్దాడ భైరాగి నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, మండల



పోలాకి : సంతకాలను సేకరిస్తున్న కృష్ణదాస్

యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు చింతాడ ఉమామహేశ్వరరావు, రాష్ట్ర యూత్ కార్యదర్శి చింతు రాఘవ, సర్పంచ్‌లు బంకా చక్రధర్, యాపార ధర్మారావు, కణితి సత్తిబాబు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని తలగాం, తెలినీలాపురం పంచాయతీల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరంచేయడాన్ని నిరసిస్తూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యాన సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, వైసిపి మండల అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సత్తారు సత్యం, కిల్లి అజకుమార్, కర్నిక గాంధీ, శ్యామలరావు, జయమోహన్, నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి, నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షులు వినోద్ పాల్గొన్నారు.

కవిటి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణలో భాగంగా ప్రభుత్వం అనుసరిస్తున్న పిపిపి విధానాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి నేత పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు వైసిపి చేపడుతున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా శనివారం సాయంత్రం రాజపురంలో సంతకాలు సేకరించి గ్రామస్థాయి కమిటీలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఎస్.కృష్ణారావు, ఎన్ని అశోక్, డిల్లిబాబు, రాఘవ, పృథ్వీ పాల్గొన్నారు.

రణస్థలం: మండల కేంద్రంలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆవిష్కరించారు.

ఆమదాలవలస: పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలను ప్రైయివేట్ పరం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైసిపి సరుబుజ్జిలి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, రాష్ట్ర అనుబంధ విభాగ కార్యవర్గ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బద్రి రామారావు, దుంపల శ్యామలరావు, అత్తులూరి రవికాంత్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల తనిఖీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి వచ్చిప్పటి నుంచీ నాణ్యమైన మద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ నిబద్ధతతో పనిచేస్తుందని ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ అన్నారు. టెక్కలి మద్యం షాపుల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల్లోని 13 మద్యం షాపుల్లో తనిఖీ చేశామన్నారు. మద్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించాక అక్కడికక్కడే నమూనాలను పరీక్షించామన్నారు. ఆ తరువాత రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలోని ఎక్సైజ్ లేబొరేటరీకి పంపించామని తెలిపారు. గత సంవత్సరం అక్టోబరు నుంచి ఈ ఏడాది సెప్టెంబరు వరకు 111 నమూనాలను సేకరించి నివేదిక తెప్పించామన్నారు. ఈ నివేదికలో ఇచ్చిన వివరాలను బట్టి ఎపి బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న మద్యం పూర్తి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నట్టుగా వెల్లడైందన్నారు. ఇకపై ప్రతినెలా అన్ని షాపుల్లో నమూనాలను సేకరించి పరీక్షించడం ద్వారా మద్యం నాణ్యతను తెలుసుకోవచ్చునని అన్నారు. వినియోగదారులకు ఎవరికైనా మద్యం నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే మా టోల్ ఫ్రీ నంబరు 14405కి ఫిర్యాదు చేయవచ్చు తెలిపారు.

కొత్తూరు: కొత్తూరులోని మద్యం షాపులను ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.కిరణ్మనేశ్వరి తనిఖీ చేశారు. ఏడాదిగా 108 నమూనాలను సేకరించి లేబొరేటరికీ పంపించామన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని మద్యం షాపులను ప్రొహిబిషన్, ఎక్సైశాఖ సిఐ పి.దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఏడాదిగా 121 నమూనాలను సేకరించి లేబొరేటరీకి పంపించామన్నారు.

కవిటి: కవిటిలోని రాజపురం, బెలగాం, బూర్జపాడు గ్రామాల్లోని మద్యం షాపులను ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఏడాదిగా 121 మద్యం నమూనాలు తీసుకుని విశాఖపట్నం లేబరేటరీకి పంపించినట్లు తెలిపారు.

సరుబుజ్జిలి : ఆమదాలవలస ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సరుబుజ్జిలి, సవలాపురం, రొట్టవలస ప్రాంతాల్లో మూడు మద్యం దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న మద్యం సీసాలు, నిల్వల రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిదిలోని పొందూరు, జి.సిగడాం మండలాల్లో గల మద్యం దుకాణాలు, బార్లలో శనివారం సిఐ వై.రాజు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం నిల్వలను పరిశీలించి నమూనాలను సేకరించి రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలోని ఎక్సైజ్ లేబరేటరీకి పంపించినట్లు ఆయన తెలిపారు. ప్రతినెలా మద్యం నమూనాలను సేకరించి నాణ్యతా ప్రమాణాలను పరీక్షించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



టెక్కలి రూరల్ : నమూనాలను సేకరిస్తున్న ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్

చెకుముకి సంబరాలు

విజయవంతానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని యుటిఎఫ్ భవనంలో చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లా కన్వీనర్ జి.కూర్మారావు అధ్యక్షతన శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జరిగిన కార్యక్రమంలో చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ను ఆవిష్కరించారు. 18న పాఠశాల స్థాయి, నవంబరు 1న మండలస్థాయి, నవంబరు 23న జిల్లాస్థాయి, డిసెంబరు 12, 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సైన్స సంబరాల్లో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సైన్స్ విద్యామాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్నాగుల వాసుదేవరావు, చెకుముకి సైన్స్ సంబరాలు రాష్ట్ర బాధ్యులు ఎస్.సాయిశ్రీనివాస్‌శర్మ, యుటిఎఫ్ జిల్లా నాయకులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, పొందూరు అప్పారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

ఎయిర్‌పోర్టుపై ఊసరవల్లి వైఖరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వీక్షణం

తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు రాజకీయ నాయకుడు ముదిరి నేత అయితే ఇక రంగులు మార్చడం వారికి వెన్నతో పెట్టిన విద్యే అవుతుంది. మందస కార్గో ఎయిర్ పోర్టు విషయంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యవహరిస్తున్న తీరు ఇందుకు అతికినట్లు సరిపోతుంది. ఎయిర్‌పోర్టుపై ఏడాది కాలంగా ప్రభావిత గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని కేంద్రమంత్రి మందస ప్రాంతంలో నిర్మించనున్న ఎయిర్ పోర్టుపై ప్రజలు వ్యతిరేకించేలా కాకుండా వారిని ఒప్పించి నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తామని ఆ మధ్య మీడియా ముఖంగా చెప్పుకొచ్చారు. ప్రజలను ఒప్పిస్తామని చెప్పిన మంత్రి నెల రోజుల్లోపే స్థానిక ప్రజలను నొప్పించేలా వ్యవహరించారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. మందస మండలం ఎం.గంగువాడ గ్రామానికి వచ్చిన మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఇతర వామపక్ష నాయకులకు తమ గోడును వెళ్లబోసుకునేందుకు సిద్ధమైన స్థానిక ప్రజలను పోలీసులు కనీసం టెంట్ కూడా వేయనీయకపోవడం ప్రభుత్వం, పోలీసుల నిరంకుశ చర్యలకు అద్దం పడుతోంది. పోలీసులు మరింత అత్యుత్సాహం ప్రదర్శించి వారిని గ్రామాల నుంచి కదలనీయకుండా చేయడం నిర్బంధానికి పరాకాష్టగా నిలిచింది. ఎయిర్‌పోర్టుపై వ్యతిరేక గొంతు వినిపించనీయకుండా ఆదిలోనే అణచివేసే చర్యలకు దిగుతున్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి తాటాకు చప్పుళ్లకు వెరవని ఉద్దాన ప్రాంత ప్రజలు పోలీసుల నిర్బంధం ఉన్నా ధైర్యంతో వివిధ మార్గాల్లో సభా వేదిక ప్రాంతానికి చేరుకుని తాము అనుకున్న సభ నిర్వహించి తీరారు. ఇటువంటి చర్యలతో ప్రభుత్వం, ఇరువురు మంత్రులు తీరుతో ప్రజల నుంచి మరింత వ్యతిరేకత మూటగట్టుకున్నట్లయింది.

శాంతియుతంగా ఎం.గంగువాడలో నిర్వహించిన సభను జరగనీయకుండా చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కుల ఉల్లంఘనే అవుతుంది. పదవీ ప్రమాణ స్వీకారంలో రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఇద్దరు అమాత్యులు రాజ్యాంగం 19వ ఆర్టికల్ ద్వారా కల్పించిన వాక్ స్వాతంత్రం, సభలు, సమావేశాలు నిర్వహించుకునే హక్కులను కాలయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది ప్రజా స్వామ్యమా? నియంత్రత్వమా? అని నాడు ప్రతిపక్ష నాయకులుగా ప్రశ్నించిన అమాత్యులు ఇరువరూ అధికారంలోకి వచ్చే సరికి అణచివేతకు పాల్పడటం పలు విమర్శలు తావిస్తోంది. బహుశా ఈ నేతలకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం గుర్తుకు వస్తోందేమో మరి. గ్రామాల్లో సభ జరగనీయకుండా అడ్డుకునే బదులు వారే గ్రామాల్లోకి వెళ్లి ఒప్పించొచ్చు. గ్రామాల్లోకి వెళ్లే ధైర్యం లేక ఇటీవల పలాసలో టిడిపి కార్యకర్తలు, సానుభూతిపరులతో సదస్సు ఏర్పాటు చేశారంటూ విమర్శలు పాలయ్యారు. సదస్సుకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు అదే పోలీసులతో గ్రామస్తులు జరుపుకునే సభను అడ్డుకోవడం గమనార్హం.

మందసలో ఎయిర్‌పోర్టు వస్తే ఉద్యోగాలు వస్తాయని చెప్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తన సమీప గ్రామం సమీపంలోని కాకరపల్లిలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగాలు వస్తాయనే పేరుతో రైతులు వ్యతిరేకించినా ఈస్ట్‌కోస్ట్ ఎనర్జిస్ కంపెనీకి 2050 ఎకరాలను ఇచ్చారని, ఆ కంపెనీ దివాలా తీయడంతో బ్యాంకులకు రుణాలు చెల్లించలేక చేతులెత్తేయడం వేలంపాటలో కోర్టు ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీకి ఇచ్చేయడం పరిణామాలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. జిల్లా అభివృద్ధి అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు నిత్యం జపం చేస్తున్నా ప్రజల్లో విశ్వాసం లేకుండాపోయింది. ఒడిశాతో జల వివాదాలతో నిలిచిపోయిన నేరడి బ్యారేజి ప్రాజెక్టుపై అదిగో ఇదిగో ఒడిశా అధికారులతో మాట్లాడం, ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహిస్తారంటూ మాటలతోనే కేంద్రమంత్రి మాటలతోనే కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్రంలో ఎన్‌డిఎ సర్కారు, ఒడిశాలో బిజెపి, ఎపిలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో ఇంతకన్నా సానుకూల పరిస్థితులు ఎప్పుడు వస్తాయని, మంత్రుల్లో చిత్తశుద్ధి లేకే నేరడి పనులు ముందుకు సాగడం లేదనే అభిప్రాయం వినిపిస్తోంది. నేరడి బ్యారేజి పూర్తయితే జిల్లాలో రెండు పంటలకు సాగు నీరందితే రైతుల ఆదాయం పెరుగుతుంది. తద్వారా వారి కొనుగోలు శక్తి పెరిగి కొత్త పరిశ్రమల రావడంతో పాటు యువతకు ఉపాధి కలిగి వలస నివారణకు దోహదపడుతుంది. అభివృద్ధి అంటే ఇది కదా. మరి వీటిని వదిలేసి కార్గో ఎయిర్ పోర్టు కోసం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తపిస్తున్నారంటే ఎవరి అభివృద్ధి కోసమో అని ప్రజలు అనుకుంటున్నారు.

పోర్టులు, ఎయిర్‌పోర్టుల కోసం భూములను ఇచ్చేందుకు ఇష్టపడని రైతుల నుంచి బలవంతంగా తీసుకునే ప్రయత్నాలు గతంలో చాలా చూశాం. ప్రజలను విభజించి పాలించు సూత్రాన్ని అమలు చేసి తమ పని చక్క బెట్టుకోవడం పాలకులతో వెన్నతో పెట్టిన విద్య. కొవ్వాడ అణు విద్యుతేంద్రం, మూలపేట పోర్టు విషయంలో అదే జరిగింది. ప్రజల మధ్య చీలిక తెచ్చేందుకు తరచూ ఉపయోగించే అస్త్రాల్లో స్థానికులు, స్థానికేతరులు అనేది ఒక అంశం. ప్రజల్లో వ్యతిరేకత లేదని, బయట నుంచి వస్తున్న వారే రెచ్చగొడుతున్నారంటూ వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులను ఉద్దేశించి ఎమ్మెల్యేలు, మంత్రులు పేర్కొనడం ఇటీవల చూస్తున్నాం తద్వారా ప్రజలకు ఎవరి మద్దతు లేకుండా ఏకాకులను చేసి తామనుకునే పని నెరవేర్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే దానిని చూడాల్సి ఉంటుంది. ఇప్పుడు మందస కార్గో ఎయిర్‌పోర్టు విషయంలో అదే విషయం పునరావృతమవుతోంది. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, టిడిపి నాయకులు కొందరు ఇటీవల ఇదే నినాదాన్ని అందుకున్నారు. నియోజకవర్గం, జిల్లాకు చెందని వారు ఎమ్మెల్యేలు అవుతుంటే, ఇదే జిల్లాలో ఉండి ప్రజలను ఒంటరిపాటు చేస్తున్న పాలకులపై తీరుపై వామపక్షాలు, ప్రజా సంఘాలు పోరాడటంతో తప్పేముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బెల్టు షాపులు నిర్మూలించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న వైసిపి మహిళా నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో బెల్టుషాపులు నిర్మూలన చేయాలని వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్యా యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. బెల్టుషాపుల నియంత్రణ, కల్తీ మద్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళలతో నిరసన ర్యాలీ చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వినతిపత్రం అందజేసి వెను తిరిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 254 ప్రమాదకరమైన బ్రాండ్‌లు అమ్ముతున్నారన్నారు. రాష్ట్రంలో 20 డిస్టరీలలో 14 వాటికి సిఎం చంద్రబాబు అనుమతిచ్చారని అన్నారు. 2014 నుంచి 19 మధ్య రూ.2.88 కోట్ల నుంచి రూ.3.84 కోట్లు పెరిగాయన్నారు. బీరు విక్రయాలు రూ.1.74 కోట్ల కేసులు నుంచి రూ.2.77 కోట్ల కేసులు అమ్మకాలు పెరిగాయన్నారు. ఎక్సైజ్ మంత్రి జవహర్ బీర్ హెల్త్ డ్రింక్‌గా ప్రచారం చేశారని చెప్పారు. చీకటి జిఒలతో రూ.5,200 కోట్లు ప్రభుత్వం నష్టం చేసినట్లు కాగ్ నివేదిక ఇచ్చిందన్నారు. రాష్ట్రం లో విచ్చలవిడిగా కల్తీ మద్యం, బెల్టుషాపులు కొనసాగు తున్నాయని, కల్తీ మద్యంతో సంబంధం ఉన్న నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమెతో పాటు కామేశ్వరి, పుష్ప, సుశీల తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఇన్‌ఛార్జిలను నియమించాలి



మాట్లాడుతున్న కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులతో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించేందుకు అనుగుణంగా క్లస్టర్ ఇన్‌ఛార్జిలను నియమించాలని నాయకులకు సూచించారు. దీనివలన కార్యక్రమం సులభంగా సాగేందుకు వీలుతుందన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా తయారుచేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం ఉదయం 10 గంటలకు రణస్థలం మండలం జె.ఆర్.పురంలో రామతీర్థాలు జంక్షన్ నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ కార్యక్రమంలో నాలుగు మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, వైసిపి మండల అధ్యక్షులు, జిల్లా అనుబంధ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో సెమినార్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో మలేషియా యూనివర్సిటీ పెర్లిస్‌కు చెందిన డాక్టర్ హుయ్ లిన్ అంగ్ చే సెమినార్ నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణహిత సాంకేతికతలు, వ్యవసాయ వ్యర్థాలను వినియోగించే కొత్త మార్గాలపై అవగాహన కల్పించారన్నారు. బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యాన 'మీరు సొంతంగా ఎలా ఉండాలి' అనే అంశంపై మరో ప్రేరణాత్మక సదస్సు కొన సాగించారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, స్వీయ అవగాహన, వ్యక్తిత్వ వికాసంపై స్పష్టమైన అంశాలు తెలియపర్చామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సహానిర్వాహకులు సివిల్ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ పి.దినకర్, జి.దుర్గ రామ నాయుడు, ఎన్.శైలజ, ఎస్.కె.ప్రసన్నలక్ష్మి, ఎం.వి.రత్నమణి, జి.వసంతి, శైలజ పాల్గొన్నారు.

పొజిషన్ ధ్రువపత్రాల వివాదంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పొజిషన్ ధ్రువపత్రాల వివాదంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న కె.బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ముగడ మహేంద్ర, జయరాంలకు బలదకు చెందిన మహిళా అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇల్లుకు పొజిషన్ ధ్రువపత్రం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. తహశీల్దార్ నిబంధనలు ప్రకారం పొజిషన్ ధ్రువపత్రం ఇవ్వడం సాధ్యం కాదని తెలియజేయగా, తప్పుడు ఆరోపణలు చేస్తూ తహశీల్దార్‌పైన, రెవెన్యూ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి భౌతిక దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి విధులు నిర్వహిస్తున్న అధికారులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రారంభిస్తున్న హరివరప్రసాద్

ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సమాజంలో యువతీ యువకులు వ్యాపార అభివృద్ధితోపాటు మరో పది మందికి ఉపాధి కల్పించే దిశగా పయనించాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు అన్నారు. మండలంలోని కొత్తపేట కూడలిలో కీర్తిశేషులు డోకి మోహనరావు రైస్‌మిల్ ప్రాంగణంలో డోకి రమణమూర్తి కుమారుడు మణికంఠ గోపి, గోవిందరాజులు కుమారుడు సత్య శ్రీనివాస్ సహితంగా ఏర్పాటు చేసిన వీరభద్ర కామేశ్వరి ట్రేడర్స్‌ను శనివారం పారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య తీరే విధంగా ఎవరి కాళ్లపై వాళ్ల నిలబడి వ్యాపార సంస్థలు నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, అంతవరపు ప్రసాద్, డోకి కృష్ణమోహన్, కోటబొమ్మాళి మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, కర్రె అప్పారావు పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉగాది శేషగిరి పాల్గొన్నారు.

క్రైస్తవ కుటుంబ నిర్మాణ సదస్సు

ప్రజాశక్తి- ఆముదాలవలస

జిల్లా పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ సౌజన్యంతో నియోజకవర్గ పాస్టర్స్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పాస్టర్స్ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన క్రైస్తవ కుటుంబ నిర్మాణం అనే అంశంపై సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు, రాష్ట్ర టిడిపి క్రైస్తవ విభాగం ప్రధాన కార్యదర్శి డి.వి.డి.వి. కుమార్ బోస్ బాబు, మండల విద్యాశాఖ అధికారి కె. మోజెస్ (అప్పలరాముడు), రిటైర్డ్ నోడల్ ఆఫీసర్ స్వామినాథన్, మనీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆరోగ్యవంతమైన, ఆధ్యాత్మిక బలమైన క్రైస్తవ కుటుంబాల నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ సంఘ నియోజకవర్గ అధ్యక్షులు పాస్టర్ రెవ. శామ్యూల్ అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీనియర్ సేవకులు బ్రదర్ అసిర్ కుమార్, డాక్టర్ ప్రత్తిపాటి ప్రసాద్, పాస్టర్ చంద్రశేఖర్ పట్నాయక్, రెవ. కృపావరం భీమ్ పాల్, అహరోన్ రాజ్, ఏలియో జాన్ పీటర్, షడ్రక్ బాబు, ఎలీషా పొందూరు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పునర్నిర్మాణంపై చర్యలు

ప్రజాశక్తి- కవిటి

ఇచ్చాపురం జనసేన ఇన్‌ఛార్జి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు ఎపి రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ రహదారి సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా రాజపురం, కమలాయిపుట్టుగ మార్గం నుంచి ఎన్‌హెచ్ 16 వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర అర్ధాంతరంగా ఆగిపోయిన రహదారి పనులను పున్రప్రారంభం చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో అనేక గ్రామాలు ప్రధాన రహదారులతో ముడిపడకుండా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రోడ్ల అనుసంధాన పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను అభ్యర్థించారు. కార్యక్రమంలో డొక్కరి ఈశ్వరరావు, పెద్దింటి చందు, పాపారావు, అంగ సురేష్‌కుమార్, శైలజ, హేమాచలపతి, గండుపల్లి రాజు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పద్య కవితల పోటీలు

ప్రజాశక్తి- అరసవల్లి

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యువ రచయితల వేదిక అధ్యక్షులు తంగి ఎర్రమ్మ ఆధ్వర్యంలో నెలవారి సమావేశంలో జిల్లాస్థాయి పద్య, కవితల పోటీల్లో ప్రథమ బహుమతి బొంతు సూర్యనారాయణ, ద్వితీయ బహుమతి బి.శ్రీనివాసరావు, తృతీయ బహుమతి రోణంకి విశ్వేశ్వరరావు, కన్సలేషన్ బహుమతులుగా రెడ్డి పద్మావతి, కుప్పిలి వెంకట రమణ, పొన్నాడ రవికుమార్, పిలకా శాంతమ్మ, డి.పార్వతీశంకు బహుమతులు అందించారు. తెలుగు భాషాభివృద్ధిపై కవితాగానంలో ఋష్యశృంగు ఢిల్లేశ్వరరావు, ఆర్.విశ్వేశ్వరరావు, ఆర్.పద్మావతి, జి.గోపాల కృష్ణ కె.జనార్దనరావు, డి.పార్వతీశం, డి.ఈశ్వరరావు కవితలను వినిపించారు. కార్యక్రమంలో పి.మాలతి, జి.సునీత, శివతేజ, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'మారని చంద్రబాబు వైఖరి'

ప్రజాశక్తి- టెక్కలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన పరిపాలన విధానంలో మార్పులు ఏ మాత్రం లేవని, అప్రజాస్వామిక విధానాలతో పరిపాలన పట్టుతప్పుతుందని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుసరించిన విధానాలే ఇప్పుడూ అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమపై తన వైఖరి స్పష్టం చేయడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా వ్యవసాయ భూములను కట్టబెడుతూ ప్రపంచ బ్యాంకు జీతగాడుగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. దళితులపై పాలకుల దాడులు ఆగడం లేదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేట్‌పరం చేసేందుకు చేస్తున్న యత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. లిక్కర్, ఇసుక, గంజాయి, మాఫియాలు చెలరేగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

నిర్వాసితులందరికీ ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జిలో ఇళ్లు, షాపులు కోల్పోయిన వారందరికీ సకాలంలో ఇళ్ల స్థలాలు అందిస్తామని టిడిపి రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. స్థానిక నెమలికొండ ప్రాంతంలో నిర్వాసితులకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలను టిడిపి నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. చెట్లు, గుట్టలు పేరుకుపోవడంతో ఆ స్థలాలు చదును చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క నిర్వాసితునికీ సెంట ఉన్నర స్థలాన్ని కేటాయిస్తూ... ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల పట్టాలు అందించారని అన్నారు. ఆ స్థలాలు త్వరలో అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో దడియాల నర్సింహులు, సవర రాంబాబు, కొత్త సత్యం, చంద్రశేఖర్‌పాడి, బద్రి గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రయ్య

దళితులకు న్యాయం చేయాలి

సరుబుజ్జిలి: మండలంలోని మూల సవళాపురం గ్రామానికి చెందిన శబరి కులస్తులపై జరుగుతున్న దాడులపై న్యాయం చేయాలని జిల్లా దళిత హక్కుల పోరాట కమిటీ నాయకులు గొల్లపల్లి ఎర్రయ్య, సిరిపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సవళాపురం జంక్షన్‌లో ఇటీవల శ్రీకాకుళం పట్టణంలో జరిగిన ఓ సంఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆవేదన వెలిబుచ్చారు. మూల సవళాపురంలో ఉన్న సుమారు 60 రెల్లి కుటుంబాలు రోజు కూలిచేస్తూ జీవనం సాగిస్తున్నాయన్నారు. ఉపాధి కోసమే శ్రీకాకుళం పట్టణానికి వెళ్లిన కొంతమంది రెల్లి కులస్తులపై తప్పుడు కేసులు బనాయించి హింసించడం బాధాకరమన్నారు. బ్యాంకర్స్ కాలనీలో జరిగిన సంఘటనలో దళిత మహిళ అని కూడా చూడకుండా విచక్షణారహితంగా దెబ్బలు కొట్టిన వ్యక్తులపై ఎస్‌పికి జిల్లా దళిత సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మూల సవళాపురం శబరి కులస్తులపై జరుగుతున్న దాడులు అక్రమ కేసులు బనాయింపులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. దాడులు చేసిన వ్యక్తులపై వెంటనే ఎస్‌సి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేనియెడల న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు రాష్ట్ర దళిత సంఘానికి ఫిర్యాదు చేసి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బాధిత మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



ఎన్నికైన విఆర్‌ఒల సంఘం కార్యవర్గం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోన అంజనీకుమార్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం పట్టణంలోని రెవెన్యూ గెస్టులో గ్రామ రెవెన్యూ అధికారుల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగుల గ్రేడ్-1, 2 ఉద్యోగోన్నతులు వంటి సమస్యలపై పోరాటం చేయనున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షునిగా డి.రాజేష్, సహాయ అధ్యక్షునిగా ప్రవీణ్, జనరల్ సెక్రటరీగా బి.రాంజీ, ట్రెజరర్‌గా జి.ఢిల్లేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్.అప్పల నాయుడు, పి.శ్రావణి, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.కొండలరావు, ధనలక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ అనుపమ, అసోసియేట్ ప్రెసిడెంట్ బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాస్, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు రామదాసు తదితరులు పాల్గొన్నారు.

సొండీల సంక్షేమ సంఘం సేవాభావం



ప్రారంభిస్తున్న డాక్టర్ రాంజీ

ప్రజాశక్తి- కవిటి

సొండీల సంక్షేమ సంఘం శనివారం సేవాభావం చాటుకుంది. కవిటి సిహెచ్‌సికి సిమెంటు బెంచీలు వితరణగా అందించి తన ఉదారత చాటుకుంది. కవిటి డయాలసిస్ కేంద్రంలో రోజూ మూడు షిఫ్టుల్లో 20 పడకలపై సుమారు 60 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. దీంతో వీరికి సహాయంగా రోజూ సుమారు 50 మంది వరకు ఆస్పత్రి వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ఓపిలో రోజూ వందలాది మంది రోగులు చేరుతున్నారు. అయితే వీరికి బయట కూర్చునే సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన చింతామణి సొండీల సంక్షేమ సంఘం రూ.25 వేలు విలువైన ఆరు సిమెంట్ బెంచీలు డయాలసిస్ కేంద్రం బయట, సిహెచ్‌సి ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. వీటిని డాక్టర్ రాంజీ, సదానందం బుధవారం ప్రారంభించారు. అదే సమయంలో 108 వాహనానికి 2 కుర్చీలు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాండవ రామారావు, మొగిలిపురి నాగేశ్వరరావు, పాండవ చంద్రశేఖర్, మొగిలిపురి రామకష్ణ, తులాల సుధ, నలాన సదానందం, మొగిలిపురి సీతారాం, రత్నాల మహేష్, బంగారు ధనుంజయం, డయాలసిస్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం కుంభకోణం సూత్రధారి జగనే

ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గత వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.3500 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని, ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రధారి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జనగ్మోహన్‌రెడ్డేనని ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి చైర్మెన్ కూన రవికుమార్ విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద్భంగా మాట్లాడుతూ నకిలీ మద్యం అంటూ వైసిపి సొంత పార్టీలో తప్పుడు వార్తలు రాయిస్తుందని మండిపడ్డారు. ప్రస్తుతం మద్యం పాలసీ పారదర్శకంగా కొనసాగుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వం మద్య షాపులు నడిపినా కల్తీ మద్యం మరణాలు సంభవించాయని అన్నారు. అయినా ఎటువంటి చర్యలు లేవని అన్నారు. మద్యం గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదని విమర్శించారు. గత ప్రభుత్వం మద్యం కుంభకోణంలో ప్రతి ఒక్కరిపై చర్యలు తప్పవని చెప్పారు. నలికీ మద్యం అమ్మితే ఎవరినీ కూటమి ప్రభుత్వం విడిచి పెట్టదని అన్నారు. నకిలీ మద్యం ప్రోత్సహించి దోచుకున్న జగన్‌కు ప్రభుత్వాన్ని ప్రశించే అర్హత లేదన్నారు. తీరు మార్చుకోకపోతే వైసిపిని ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. నాయకులు పి.ఎం.జె. బాబు, సింతు సుధాకర్, ప్రధాన జయరాం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో ఒరిగేదేమీలేదు

మాజీ మంత్రి అప్పలరాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలూ అభివృద్ధి, ప్రజా సంక్షేమం గాలికి వదిలేసిందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. స్థానిక కీర్తన పంక్షన్ హాల్‌లో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు రోడ్లపైకి వచ్చి నిరసనలు, ధర్నాలు చేస్తున్నారంటే ఈ ప్రభుత్వంపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని అన్నారు. అరకొరగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలోనూ పార్టీ వివక్షలు చూపిస్తున్నారని మండిపడ్డారు. వైసిపి నాయకులను, కార్యకర్తలను వేధించడం, తప్పుడు కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. అనంతరం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల సేకరణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దుంపల లక్ష్మణరావు, సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు, సిస్టు గోపి, దువ్వాడ రవి, తిర్రి రాజారావు, దల్లి జానకిరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: మండలంలోని దేవరాపల్లి గ్రామ సర్పంచ్ మీసాల శ్రీనివాసరావు మాతృమూర్తి శుక్రవారం స్వర్గస్తులైన విషయం తెలుసుకుని శనివారం వారి స్వగృహానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించారు. అనంతరం ఆమె మృతిపై ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈయనతో వైసిపి నాయకుల గొర్లె అప్పల నాయుడు, మీసాల తవిటి నాయుడు, గెడ్డపు తమ్మి నాయుడు, పిషిని సత్యం, చందక రాము నాయుడు, సత్యనారాయణ, మీసాల రమేష్ బాబు పాల్గొన్నారు. అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ సర్పంచ్ శ్రీనివాసరావును పరామర్శించారు. ఈయనతో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకట రెడ్డి, పిన్నింటి లక్ష్మునాయుడు, మహంతి జోగినాయుడు తదితరులున్నారు.

గర్ల్ చైల్డ్ డేపై అవగాహన

పోలాకి: మండలంలోని కస్తూరిబా కళాశాలలో గంగివలస పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యాన ఆరోగ్య విస్తరణాధికారి, మానవ వ్యాధులు పరిశోధకులు డాక్టర్ నల్లి రవికుమార్ గర్ల్ చైల్డ్ డేపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లలకు విద్య, ఆరోగ్యం, రక్షణ, అవకాశాలు అందించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, బేటీ బచావో బేటీ పడావో అనే సందేశాన్ని సమాజంలో బలంగా ప్రతిధ్వనింపజేయడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. ఆడపిల్లలను పురిట్లోనే చంపేసే సంస్కృతిని విడనాడాలన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జ్యోతి, పిటి ప్రియ, ఉపాధ్యాయులు, శేఖర్‌బాబు, మోహిని లక్ష్మి పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటాల పంపిణీ

ఇచ్ఛాపురం: పట్టణంలోని ముత్యాలమ్మపేటలోని కుటుంబాలకు అంబేద్కర్ చిత్రపటాలను జైభీమ్ సేన జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సల్ల దేవరాజు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైభీమ్ సేన అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి అంబేద్కర్ చిత్రపటాలు, రాజ్యాంగ్యాన్ని పంపిణీ చేశామని తెలిపారు. జై భీమ్ సేన జిల్లా అధ్యక్షులు బుస్క ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డొప్ప వెంకటరావు, దళిత సంఘ నాయకులు బోనేల ఆనంద్, వాసుదేవరావు, శేఖర్, మాధవరావు పాల్గొన్నారు

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ఇచ్ఛాపురం ఇచ్ఛాపురం మందుల వర్తక సంఘం, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సంయుక్తంగా సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ జిఎస్‌టి 2.0పై శనివారం అవగాహన కల్పించారు. మందులు, వైద్య పరికరాలు, కేన్సర్, సుగర్, బిపి వస్తువులపై తగ్గింపు వివరించారు. జిల్లా మందులు వర్తక సంఘ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రంగాల జానకిరామ్‌రెడ్డి, వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డి, వర్తక సంఘ కార్యదర్శి సుధీర్‌కుమార్ రోలో, కిషోర్, అన్నారావ్, గణపతి, దుర్గాప్రసాద్, నరసింగసాహు, సంతోష్ సాహు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పొజిషన్ ధ్రువపత్రాల వివాదంపై నలుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు కొత్తూరు ఇన్‌ఛార్జి ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. తన అనుమతి లేకుండా బలదకు చెందిన ఆరుబోలు కమల, దేవాది చంద్రశేఖర్, సనపల రవిలు కార్యాలయానికి వచ్చి దురుసుగా ప్రవర్తించారని, కులం పేరుతో తనను దూషించారని తహశీల్దార్ కె.బాలకృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. అలాగే అసభ్యకరంగా తహశీల్దార్ తనపై ప్రవర్తించారని కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహశీల్దార్‌పై కేసు నమోదు చేశామన్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సవరమ్రిపాడులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేశామని ఎస్ఐ పి.రమేష్‌బాబు తెలిపారు. గ్రామంలోని ఓ ప్రదేశంలో కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తన సిబ్బందితో దాడులు చేపట్టామన్నారు. వారి వద్ద నుంచి రూ.8,750 నగదును స్వాధీనం చేసుకున్నారు. నాలుగు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆర్‌టిఐ బోర్డులను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

అక్టోబర్ 12న సమాచారహక్కు దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామ సచివాలయంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కుచట్టం బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్‌టిఐ సామాజిక కార్యకర్త దన్నాన శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని సచివాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు బదిలీ జరిగాక సమాచార బోర్డులో అధికారుల పేర్లు కూడా మార్చకపోవడం సమాచారం హక్కు చట్టంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకొని ప్రతి సచివాలయంలో, ప్రభుత్వ కార్యాలయల్లో సమాచార హక్కు బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ప్రొక్లెయినర్

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో పారిశుధ్య పనులను అధికారులు ముమ్మరంగా చేపట్టారు. మండల కేంద్రంలోని చెరువు చుట్టూ ఉన్న చెత్తను తొలగించి జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. బిసి కాలనీ నుంచి చెరువుగట్టు వరకు ఉన్న ప్రధాన రహదారి కాలువలను జెసిపి సహాయంతో శుభ్రపరిచారు. గ్రామంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేగ అనురాధ, కార్యదర్శి బి.కిరణ్ కుమార్, ఎంపిటిసి చొక్కర పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

కుమ్మరిపేటలో అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

అన్నదానం మహాదానమని ప్రతిఒక్కరు అన్నదానంలో పాల్గొనాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలంలోని కుమ్మరిపేటలో శనివారం ఉమా సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ ఆలయ నిర్మాణానికి నడుం బిగించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అర్చనను కలిసిన విఒఎలు

విఒఎల కాలపరిమితి రద్దుపై హర్షం

నరసన్నపేట: విఒఎల మూడేళ్ల కాలపరిమితిని సిఎం చంద్రబాబు నాయుడు రద్దు చేయడంపై విఒఎలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు బగ్గు అర్చనను శనివారం కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి హయంలో మూడేళ్ల కాల పరిమితిని తెచ్చారని గుర్తు చేశారు. దానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. చంద్రబాబు సిఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తమపై ఉదారత చూపి రద్దు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చనమ్మ, కల్పన, మహిళలు పాల్గున్నారు.

ఆర్థికసాయం

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లికి చెందిన గేదెల పగడాలమ్మ కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. పగడాలమ్మ కుటుంబానికి ఆదుకోవడానికి గ్రామంలోని వారంతా విరాళాలుగా సేకరించిన రూ.67 వేలు శనివారం ఆమెకు అందించారు. ఆమెకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలాకి షణ్ముఖరావు, రౌతు బాలరాజు, పొట్నూరు సూర్యనారాయణ, రట్టి ఆదినారాయణ, దారపు పాపారావు, ఎన్ని షణ్ముఖరావు, పెదరట్టి మణి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

ఆహ్లాదం లేని గాంధీ పార్కు



శిధిలావస్థకు చేరిన జారుడుబల్ల

ప్రజాశక్తి- అరసవల్లి

నగరంలోని భాపూజీ కళా మందిర్ ప్రక్కనే ఉన్న గాంధీ పార్కు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందనంగా మారింది. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్క్ నేడు కళావిహీనంగా మారింది. పార్కులో ఉన్న జారుడుబల్లలు, రౌండ్‌వీల్ చైర్, ఉయ్యాల జంపింగ్ ఆట వస్తువులు అన్ని శిధిలావస్థకు చేరుకున్నాయి. అప్పుడప్పుడు చిన్నపిల్లలు వాటిపై ఎక్కిఆడటం వలన చిన్నచిన్న గాయాలవుతున్నాయని పార్క్‌కు వచ్చిన సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా 2004లో అప్పటి ఎంపి కింజరాపు ఎర్రంనాయుడు, పురపాలక సంస్థ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి ఉన్నప్పుడు రాధాకృష్ణ విగ్రహం, వాటర్ ఫాల్స్, ఫౌంటెన్ ప్రారంభించారు. ప్రస్తుతం వాటర్ ఫాల్స్ రాళ్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. పౌంటెన్ పూర్తిగా కనుమరుగైంది. అక్కడే ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం శిధిలావస్థకు చేరింది, పైపై రంగులు అద్ది శిథిలాలు కనపడకుండా చేస్తున్నారు. పార్క్‌లో ఉన్న జింకలు, నెమళ్ల బొమ్మలు పూర్తిగా శిధిలంగా మారి అంధవికారంగా కనిపిస్తున్నాయి. నగర



పాలక సంస్థ అధికారులు స్పందించి కొత్తవి ఏర్పాటుచేసి పార్కు అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.